ప్రజాశక్తి
శుక్రవారం 9 జూన్ 2023
5
శ్రీకాకుళం

ట్రిపుల్ ఐటి విద్యార్థుల నివాళి

ఎచ్చెర్ల : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన ఒడిశా రైలు ప్రమాద మృతులకు కొవ్వొత్తులు వెలిగించి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పి.జగదీశ్వరరావు, ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహనకృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, రఘుపతి, కో-ఆర్డినేటర్ పెద్దింటి ముకుందరావు, ప్రోగ్రాం అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇదేం 'మద్దతు'?

- వరికి క్వింటాకు రూ.143 మద్దతు ధర పెంపు
- ఏటా పెరుగుతున్న వ్యవసాయ ఇన్‌పుట్స్ ధరలు
- తడిసిమోపడవుతున్న పంట ఖర్చులు
- కేంద్రం మద్దతు ధరపై అన్నదాతల పెదవివిరుపు

కేంద్ర ప్రభుత్వం ఒకవైపు ఎరువులు, విత్తనాలపై సబ్సిడీ క్రమేణా ఎత్తివేస్తోంది. మరోవైపు పెట్రోల్ సెంచరీ దాటగా, డీజిల్ ధర వందకు సమీపంలో ఉంది. పంట కాలంలో వినియోగిస్తున్న యంత్రాల అద్దెలూ పెరిగాయి. రైతులపై పలురూపాల్లో భారం మోపుతున్న బిజెపి ప్రభుత్వం పంటల మద్దతు ధర విషయానికి వచ్చేసరికి చేతులు రావడం లేదు. వరికి క్వింటాకు రూ.143 మాత్రమే పెంచి చేతులు దులుపుకుంది. పంట ఖర్చులు అధికంగా పెరిగిన నేపథ్యంలో మద్దతు ధరపై ఆశలు పెట్టుకున్న అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులను తీవ్ర నిరాశకు గురి చేసింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో వరి ప్రధాన పంటగా ఉంది. ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి మొత్తం 5.59 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఖరీఫ్‌లో 5,09,238 ఎకరాల్లో, రబీలో 50 వేల ఎకరాల్లో వరి పంట పండిస్తున్నారు. రెండు సీజన్లలో కలిపి మొత్తం 12 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వస్తోంది. రైతుల సొంత అవసరాలకు పోనూ పది లక్షల టన్నులకు పైగా ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు అమ్ముతున్నారు. 2022 ఖరీఫ్ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వం వరికి క్వింటాకు రూ.వంద పెంచడంతో, అప్పటివరకు రూ.1940 వరకు ఉన్న సాధారణ రకం ధాన్యం ధర రూ.2040కు పెరిగింది. అదేవిధంగా గ్రేడ్-ఎ రకం రూ.1960 నుంచి రూ.2060కి పెరిగింది. ప్రస్తుతం అంటే క్వింటాకు రూ.143 పెంచడంతో సాధారణ రకానికి రూ.2,183, గ్రేడ్-ఎ రకానికి రూ.2,203 దక్కనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరపై రైతులు పెదవి విరుస్తున్నారు. పంట ఖర్చులు విపరీతంగా పెరిగిన తరుణంలో ఇది ఏ మూలకు సరిపోతుందని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

పెరిగిన పంట ఖర్చులు

గతేడాదితో పోలిస్తే పంట ఖర్చులు విపరీతంగా పెరిగాయి. గత ఖరీఫ్ సీజన్‌లో దుక్కులకు రూ.5,500 ఉంటే ప్రస్తుతం రూ.6,500 చెల్లించాల్సి ఉంటుందని రైతులు చెప్తున్నారు. పురుగు మందుల కోసం గతేడాది రూ.రెండు వేలు ఖర్చు చేయగా, ఈ ఏడాది రూ.2,500కు పెరిగే అవకాశముంది. ఉబాల కోసం 2022 ఖరీఫ్‌లో రూ.ఆరు వేల ఖర్చు చేయగా ఇప్పుడు రూ.7,500 వరకు ఖర్చు ఉంటుందని రైతులు చెప్తున్నారు. పతేరా కంపెనీకి చెందిన గులికలు గతేడాది రూ.1800లు ఉండగా ప్రస్తుతం రూ.2,200కు చేరింది. ప్రస్తుతం లీటరు పెట్రోల్ రూ.111.23 ఉండగా, డీజిల్ రూ. 98.97 ఉంది. గతేడాదితో పోలిస్తే పెట్రోల్, డీజిల్ ధరల్లో పెద్దగా మార్పులు లేకపోయినా పంట కాలంలో వినియోగిస్తున్న యంత్రాల అద్దెలు పెరిగాయి. గతేడాది పొలాలకు నీరు పెట్టేందుకు ఇంజిన్‌కు రూ.మూడు వేలు అద్దె వసూలు చేయగా, ఇప్పుడు రూ.5,500 వరకు పెంచినట్లు తెలుస్తోంది. కోత మిషన్ అద్దె రూ.4,500 నుంచి రూ.5,500 వరకు ఉంటుందని రైతులు చెప్తున్నారు. చివరకు ఇళ్లకు ధాన్యం తెచ్చుకునేందుకు గతేడాది రూ.300 చెల్లించగా, ఇప్పుడు అదనంగా మరో రూ.100 చెల్లించాల్సి ఉంటుందని చెప్తున్నారు. మొత్తమ్మీద ఎరువులు, విత్తనాల ధరలు, కూలీలకు చెల్లింపులు, ఇతరత్రా ఖర్చులు కలిపి గతేడాది ఎకరాకు రూ.27 వేలు వరకు ఖర్చయిందని రైతులు చెప్తున్నారు. ఈ ఏడాది మరో మూడు వేల రూపాయలు అదనంగా ఖర్చవుతుందని రైతులు అంచనా వేస్తున్నారు.

కంటితుడుపు చర్య

స్వామినాథన్ కమిటీ సూచించిన సిఫార్సులకు అనుగుణంగా ప్రభుత్వం పంటలకు మద్దతు ధరలను నిర్ణయించాలి. సాగు కోసం చేసిన మొత్తం ఖర్చులో అదనంగా 50 శాతం మేర మద్దతు ధర ప్రకటించాలి. కేంద్ర ప్రభుత్వం చాలా నామమాత్రంగానే మద్దతు ధర ప్రకటించింది. వ్యవసాయ ఇన్‌పుట్స్ ధరలను విపరీతంగా పెంచిన కేంద్ర ప్రభుత్వం కంటితుడుపు చర్యగా మద్దతు ధర ప్రకటించింది. ఢిల్లీలో రైతుల ఆందోళనల తర్వాత పంటలకు గ్యారంటీ మద్దతు ధర చట్టం చేస్తామని మోడీ హామీనిచ్చినా, ఇప్పటివరకు అమలు చేయకపోవడం రైతులపై కేంద్రం చిత్తశుద్ధిని తెలియజేస్తోంది

- కె మోహనరావు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

పారిశుధ్య కార్మికుల పోరాట విజయం

ప్రజాశక్తి - పొందూరు

పొందూరు మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులు పోరాడి విజయం సాధించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఇఎస్‌ఐ అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన పారిశుధ్య కార్మికులు ఈనెల ఒకటో తేదీ నుంచి సమ్మె చేపట్టారు. సమ్మెలో భాగంగా ధర్నాలు, దీక్షలు, ప్రదర్శనలతో పలురూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కార్మికుల సమ్మెతో పంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. ఈ నేపథ్యంలో యూనియన్ నాయకులతో పంచాయతీ అధికారులు, సర్పంచ్ చర్చలు జరిపారు. ప్రస్తుతం ఉన్న వేతనంపై నెలకు రూ.1,500 పెంచడంతో పాటు ఇఎస్‌ఐ అమలు చేస్తామని, సమ్మె కాలానికి వేతనాలు చెల్లించేందుకు అంగీకరించారు. ఇందుకు సంబంధించి డిపిఒ నుంచి ఉత్తర్వులు రావడంతో కార్మికులు సమ్మె విరమించి, శుక్రవారం నుంచి విధులకు హాజరు కావాలని నిర్ణయించారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగడి లక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్ కార్మికులకు నిమ్మరసం ఇచ్చి సమ్మెను విరమింపజేశారు. పోరాడి విజయం సాధించిన కార్మికులకు సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కె.రమణమూర్తి, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, వైసిపి పట్టణాధ్యక్షులు గాడు నాగరాజు, రెడ్‌క్రాస్ సభ్యులు కె.శాంతారాం, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.నాగరాజు, పి.కనకరాజు, పి.కొండయ్య, సిహెచ్.కనకమ్మ, పి.కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేస్తున్న సర్పంచ్ లక్ష్మి

99.5 శాతం హామీల అమలు : వైసిపి

పోలాకి : ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99.5 శాతం హామీలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో జిల్లాకు పలు అంశాల్లో మేలు చేసే విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. పలాసలో నిర్మాణం పూర్తి చేసుకున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి 41 మంది వైద్యాధికారులను నియమించడం వల్ల ఉద్దానం కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎపి వైద్య విధాన పరిషత్‌ను ప్రభుత్వ శాఖగా మార్చాలని మంత్రివర్గం తీర్మానించడం వల్ల ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 6,200 మంది ఉద్యోగులకు మేలు చేకూరనుందని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ వల్ల జిల్లాలో పలు శాఖల్లో ఉన్న 1800 మందికి ప్రయోజనం చేకూరనుందని పేర్కొన్నారు. 12వ పిఆర్‌సి సిఫార్సులతో జిల్లాలోని 40 వేల మంది ఉద్యోగులకు మేలు కలగనుందని తెలిపారు. మేనిఫెస్టోలను పార్టీ వెబ్‌సైట్ నుంచి తొలగించిన టిడిపి, ఇప్పుడు మోసపూరిత వాగ్దానాలతో మరోసారి మభ్య పెట్టేందుకు సిద్ధమవుతోందని విమర్శించారు.

బియ్యం అప్పగించకుంటే...

బ్యాంకు గ్యారంటీల జప్తు

మిల్లర్లకు ఇన్‌ఛార్జి కలెక్టర్ హెచ్చరిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఖరీఫ్‌లో ధాన్యం మర ఆడిన తర్వాత ఇవ్వాల్సిన కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్)ను ఈనెల 30వ తేదీ లోగా ఇవ్వకుంటే సంబంధిత మిల్లర్ల బ్యాంకు గ్యారంటీలను జప్తు చేస్తామని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ హెచ్చరించారు. సిఎంఆర్‌పై కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు 200 మంది మిల్లర్ల నుంచి 38 వేల మెట్రిక్ టన్నుల బియ్యం బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఎఫ్‌సిఐ, పౌర సరఫరాల సంస్థకు ఈనెల 20వ తేదీలోగా బియ్యం అప్పగించాలని ఆదేశించారు. ఈనెల 30వ తేదీ లోగా శతశాతం బియ్యం ఇవ్వాలని, లేకుంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బియ్యం నాణ్యత దెబ్బతినకుండా నెమ్మదిగా మర ఆడిస్తున్నామని, మరికొంత సమయం కావాలని కొంతమంది మిల్లర్లు అడిగినా ఆయన తిరస్కరించారు. మిల్లుల్లో సిసి కెమెరాలు, డ్రయర్ మిషన్లు తప్పనిసరిగా ఉండాలని, వెంటనే సమకూర్చుకోవాలని ఆదేశించారు. మిల్లర్లు అందజేసే సిఎంఆర్‌పై జిల్లా పౌర సరఫరాల సంస్థ, పౌర సరఫరాలశాఖ అధికారులు రోజువారీ నివేదికలు సమర్పించాలన్నారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, జిల్లా సరఫరా అధికారి డి.వి రమణ, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆర్.వెంకటేశ్వరరావు (వాసు) తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్

నాసిరకం ఇన్‌పుట్స్‌తో దిగుబడులపై ప్రభావం

- క్వాలిటీ కంట్రోల్ అధికారులు అవగాహన పెంచుకోవాలి
- వ్యవసాయశాఖ కమిషన్ కార్యాలయ జెడి కృపదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రైతులకు నాసిరకం ఇన్‌పుట్స్ అందిస్తే, దాని ప్రభావం పంటల దిగుబడిపై ఉంటుందని గుంటూరు వ్యవసాయశాఖ కమిషన్ కార్యాలయ జెడి వి.డి.వి కృపదాస్ అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో నాణ్యత నియంత్రణపై శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల వ్యవసాయశాఖ అధికారులకు గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. పంటల సాగుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సరఫరా చేయాలన్నారు. అప్పుడు మాత్రమే వ్యవసాయ ఉత్పత్తులు పెరిగి రైతులకు మంచి ఆదాయం వస్తుందని చెప్పారు. కొన్ని కంపెనీలు నాణ్యత లేని ఇన్‌పుట్స్‌ను సరఫరా చేస్తుండడంతో, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. క్వాలిటీ కంట్రోల్ తనిఖీ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. నాణ్యతా నియంత్రణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు.

చట్టాల్లో రైతులకు మేలు చేసే అంశాల అమలపై అధికారులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుంటూరు వ్యవసాయశాఖ కమిషన్ కార్యాలయం నుంచి వచ్చిన వ్యవసాయశాఖ సహాయక సంచాలకులు కె.జె.డి రాజన్ ఎరువుల విక్రయాల చట్టం, మరో సహాయ సంచాలకులు సుదర్శన్‌రాజు విత్తన చట్టంపై అవగాహన కల్పించారు. సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు విక్రయదారులు నిర్వహించాల్సిన రికార్డులు, కోర్టు కేసుల వివరాలపై, ఎడి ఎ.మధు పురుగు మందుల చట్టాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్, వి.టి రామారావు, పాల్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శాశ్వత లోక్ అదాలత్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన హై లెవల్ కమిటీ సమావేశాన్ని స్థానిక న్యాయ సేవా సదన్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవలకు భంగం వాటిల్లితే, ఆ వ్యక్తి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చన్నారు. ఆ విధంగా వచ్చిన కేసులను శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ తీర్మానించి, సమస్యను బట్టి సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేస్తారని చెప్పారు. సమస్య లేకుంటే ఆ కేసును ముగిస్తారని తెలిపారు. శాశ్వత లోక్ అదాలత్ ద్వారా అందిస్తున్న సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో కేసులు ఫైల్ చేయడానికి ఎటువంటి ఫీజులు చెల్లించనవసరం లేదని చెప్పారు. ఎటువంటి కేసులనైనా 90 రోజుల్లో పరిష్కారమవుతుందని, సివిల్ కోర్టుల్లో మాదిరిగా ఏళ్ల తరబడి నిరీక్షించాల్సిన అవసరం ఉండబోదని స్పష్టం చేశారు. ఇటువంటి వ్యవస్థపై అధికారులు మరింత శ్రద్ధ వహించి, ఆయా శాఖాధికారులు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞానసువర్ణరాజు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లోని లోపాల కారణంగానే కోర్టును ఆశ్రయిస్తారని, అటువంటివి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, గృహ నిర్మాణ సంస్థ పీడీ ఎన్.గణపతి, జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ కుమార్, ఎల్ఐసి చీఫ్ మేనేజర్ సత్యనారాయణ సాహు, డ్వామా, టెలికాం పరిపాలన అధికారులు కె.వి.ప్రసాద్, జె.పాపారావు, నగరపాలక సంస్థ ఇంజినీర్ పి.వి.గంగాధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌టిసి అధికారులు

తక్కువ ధరకే డోర్ పికప్, డెలివరీ

- ఆర్‌టిసి లాజిస్టిక్ సేవలు వినియోగించుకోవాలి
- ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్

శ్రీకాకుళం : ఎపిఎస్ ఆర్‌టిసి లాజిస్టిక్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ కోరారు. షిప్‌మంత్ర వెబ్‌సైట్‌కి సంబంధించిన పోస్టర్లను తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్శిళ్లను శ్రీకాకుళం నుంచి విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కాకినాడ, విజయవాడ నగరాలకు తక్కువ ధరకే, తక్కువ సమయంలోనే డోర్ పికప్, డోర్ డెలివరీ సౌలభ్యం పొందవచ్చని చెప్పారు. ఈ సౌలభ్యం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే పొందవచ్చని తెలిపారు. వినియోగదారులు ఏ సమయంలోనైనా ఆన్‌లైన్ ద్వారా పార్శిల్‌ను బుకింగ్ చేసుకోవచ్చని చెప్పారు. పికప్, డెలివరీ మాత్రం ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ప్రస్తుతానికి కేటాయించినట్లు తెలిపారు. వినియోగదారులు తమ పార్శిళ్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే సంబంధిత సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పార్శిల్ తీసుకెళ్లి, నిర్ణీత చిరునామా వద్ద డోర్ డెలివరీ చేస్తారని చెప్పారు. ఇందుకు షిప్‌మంత్ర సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. www.Shipmantra.com, www.apsrtc logistics.in వెబ్‌సైట్ ద్వారా డోర్ డెలివరీ, పికప్ సదుపాయం పొందవచ్చని చెప్పారు. సెల్‌ఫోన్ నంబరు, సరుకుల వివరాలు, పంపించాల్సిన చిరునామా, గుర్తింపుకార్డు వివరాలను నమోదు చేసి నమోదు కావాలన్నారు. అనంతరం తమ సిబ్బంది చేరుకుని ప్యాకింగ్ చేసి తీసుకెళ్తారని చెప్పారు. ఈ సరుకులకు బీమా సౌకర్యం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో షిప్‌మంత్ర మేనేజింగ్ డైరెక్టర్ దినేష్, నెక్ రీజియన్ కమర్షియల్ మేనేజర్ దివ్య, శ్రీకాకుళం ఒకటి, రెండో డిపో మేనేజర్లు మాధవ, శర్మ, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) రమేష్, డిఎంఇ ఇజాజ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసిపి ఓటమి ఖాయం

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసిపి ఓటమి ఖాయమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని ఒక కళ్యాణ మండపంలో నియోజకవర్గ పరిశీలకులు ద్వారపూడి జగదీష్ ఆధ్వర్యాన భవిష్యత్‌కు గ్యారంటీ అన్న కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి జాడే లేదని విమర్శించారు. సిపిఎస్ రద్దు, 45 ఏళ్లు దాటిన మహిళలకు పెన్షన్, మద్య నిషేధం తదితర హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలను మోసం చేశారని చెప్పారు. మాట తప్పడం, మడమ తిప్పడం జగన్‌కు అలవాటైపోయిందని దుయ్యబట్టారు. 2014లో రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్, రూ.1.28 వేల కోట్ల అప్పులు, రాజధాని లేని రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం 134 పథకాలను అమలు చేసిందని చెప్పారు. వైసిపి అధికారంలోకొచ్చాక వంద పథకాలను రద్దు చేసి, 35 పథకాలకు పేర్లు మార్చి వాటిని అమలు చేస్తూ గొప్పలు చెప్పడం జగన్మోహన్ రెడ్డికే దక్కిందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ నెల వరకు ఉచిత బియ్యాన్ని రేషన్ కార్డుదారులకు అందిస్తే, ఆ బియ్యాన్ని అమ్ముకుని ప్రజలకు అందించలేని చేతగాని ముఖ్యమంత్రి జగన్ అని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఆరు లక్షల పెన్షన్లను అనవసర నిబంధనలతో తొలగించారని తెలిపారు. ప్రజలకు ఆసరాగా నిలబడాలన్న ఉద్దేశంతోనే మహానాడులో చంద్రబాబు నాయుడు మహాశక్తి పేరుతో విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పొత్తుల్లో భాగంగా ఆమదాలవలస అసెంబ్లీ స్థానాన్ని వేరే పార్టీకి ఇస్తారని కొందరు ప్రచారం చేస్తున్నారని అధిష్టానం బిజెపి, జనసేన పార్టీలకు టిక్కెట్ ఇచ్చినా వారి గెలుపు కోసం సైనికుడిలా పనిచేస్తానన్నారు. పొందూరు మండలంలోని రెల్లిగడ్డకు టిడిపి హయంలో రూ.12 కోట్లు మంజూరు చేయిస్తే, నేటికీ ఆ పనులను పూర్తి చేయలేని అసమర్థ ఎమ్మెల్యే తమ్మినేని సీతారాం అని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, పి.ఎం.జె బాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షులు తమ్మినేని సుజాత, టిడిపి మండల అధ్యక్షులు నూకరాజు, శివ్వాల సూర్యం, బోనెల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

అధికారం కోసం చంద్రబాబు అడ్డదారులు

- ఉద్యోగుల పక్షపాతి సిఎం జగన్
- కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అధికారం కోసం ఎన్ని అబద్ధాలైనా ఆడగల, ఎన్ని అడ్డదారులైనా తొక్కగల అనైతిక నాయకుడు చంద్రబాబు అని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి ఆరోపించారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు ఇటీవల విడుదల చేసిన 2024 ఎన్నికల మేనిఫెస్టోలో నోటికి వచ్చిన హామీలు ఇచ్చారని, అవి ఎలా అమలుకు సాధ్యమో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిన చంద్రబాబు ఎన్ని హామీలిచ్చినా ప్రజలు నమ్మరని, ఆయన అధికారంలోకి రాలేరని తెలిపారు. జగన్‌ను ముఖ్యమంత్రి కానివ్వకుండా చేయడమే లక్ష్యం తప్ప, రాష్ట్ర భవిష్యత్ చూసే నాయకత్వ లక్షణాలు లేని వ్యక్తి పవన్ కళ్యాణ్ అని విమర్శించారు. అటువంటి వ్యక్తి వెంట జనసేన కార్యకర్తలు, నాయకులు తిరిగి వారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు.

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉద్యోగుల పక్షపాతి అని కేబినెట్‌లో విప్లవాత్మక నిర్ణయాలతో మరోసారి రుజువు చేసుకున్నారని చెప్పారు. 12వ పిఆర్‌సికి సంబంధించిన ప్రకటన, 11వ పిఆర్‌సికి సంబంధించి విడతల వారీగా బకాయిలు చెల్లించేందుకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంతో ఉద్యోగ వర్గాల్లో పండగ వాతావరణం కన్పిస్తోందన్నారు. పెన్షన్‌తో ఉద్యోగ భద్రత ఉంటుందని భావించి, ఉద్యోగుల ప్రయోజనం కోసం సిపిఎస్ స్థానంలో జిపిఎస్ విధానాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ఉద్యోగ విరమణ అనంతరం ఉద్యోగి చివరి నెలలో మూల వేతనంతో 50 శాతం పెన్షన్, ప్రతి ఆరు నెలలకు కరువు భత్యం ఇవ్వడం ద్వారా మెరుగైన పెన్షన్‌ను అందించనున్నట్లు తెలిపారు. 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులు రెగ్యులరైజేషన్ చేశారని, కొత్తగా అన్ని శాఖల్లోనూ 6,845 ఉద్యోగులను భర్తీ చేయనున్నారని చెప్పారు. సమావేశంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, వైసిపి నాయకులు శిమ్మ రాజశేఖర్, ఎన్ని ధనుంజయ, డబ్బీరు శ్రీనివాస్ పట్నాయక్, ఎం.ఎ బేగ్, ఎం.ఎ రఫీ, గుంట జ్యోతి, ఎ.రాధ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృపారాణి

దరఖాస్తులను అందజేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్స్, ఆర్ట్స్, డ్రాయింగ్, డబ్ల్యుఇ, ఎంటిఐ, సంగీత ఉపాధ్యాయులు తమ బదిలీలకు సంబంధించిన దరఖాస్తును హెచ్‌ఎంతో ధ్రువీకరించి ఈనెల తొమ్మిదో తేదీ నాటికి డిఇఒ కార్యాలయానికి అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి టి.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు.

తప్పనిసరి బదిలీల పరిధిలో ఉన్న (ఎనిమిది అకడమిక్ సంవత్సరాలు పూర్తయిన) ఉపాధ్యాయులు తమ దరఖాస్తును తప్పనిసరిగా అందజేయాలని స్పష్టం చేశారు. తప్పనిసరి బదిలీల పరిధిలో లేని ఉపాధ్యాయులు ఐచ్ఛిక బదిలీ కోరుకుంటే దరఖాస్తును అందజేయాలని తెలిపారు.

శతశాతం రీ సర్వే లక్ష్యాలు పూర్తి

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో జూన్ నెలాఖరుకు పూర్తి కావాల్సిన రీ సర్వే పనులు శతశాతం పూర్తయినట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ భూపరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్‌కు వివరించారు. రీ సర్వే పనుల పురోగతిపై భూ పరిపాలన ప్రధాన కమిషనర్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రెండో విడత రీ సర్వే పనుల్లో జూన్‌కు గానూ 150 గ్రామాల లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించిందని తెలిపారు. అందులో ఇప్పటివరకు 133 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని, దీంతో దాదాపు శతశాతానికి అతి చేరువలో ఉన్నట్లు చెప్పారు. ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలు అందించడం ద్వారా నిర్దేశించిన సమయానికి ముందే లక్ష్యాలను సాధించగలిగినట్లు వివరించారు. జిల్లాలో రీ సర్వే పనుల పురోగతిపై సాయిప్రసాద్ అభినందించారు. మిగిలిన జిల్లాల్లోనూ ఇదే మాదిరిగా నిర్దేశించిన సమయానికి ముందే పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెసి నవీన్

సామగ్రిని అందజేస్తున్న నిత్యానందరెడ్డి

'అరబిందో' సామగ్రి అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సుబిలిటీలో భాగంగా అరబిందో ఫార్మా ఫౌండేషన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానందరెడ్డి రూ.5 లక్షలు విలువైన పర్సనల్ ప్రొటెక్టీవ్ ఎక్విప్‌మెంట్, కార్యాలయానికి అవసరమైన కంప్యూటర్లు, స్కానర్, కలర్, బ్లాక్ అండ్ వైట్ ప్రింటర్లు అందజేశారు. ఈ మేరకు జిల్లా విపత్తుల స్పందన, అగ్నిమాపక కార్యాలయ అధికారి మోహనరావుకు గురువారం సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా నిత్యాందరెడ్డి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాల నివారణకు, కార్యాలయ నిర్వహణకు అవసరమైన పరికరాలను అందజేశామన్నారు. అగ్నిమాపకశాఖ కార్యాలయంలో పనులు చాలా సులభతరం అవుతుందని అన్నారు. కార్యాలయాల అవసరమైన సామగ్రిని అందజేయడంపై అరబిందోకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యాక్రమంలో అసిస్టెంట్ అగ్నిమాపక అధికారి వరప్రసాదరావు, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వేను పరిశీలిస్తున్న చైర్మన్ గిరిబాబు

భూముల పరిరక్షణకే రీ సర్వే

మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

పలాస: ప్రభుత్వ భూములతో పాటు ప్రజల ఆస్తులను పరిరక్షించేందుకే ప్రభుత్వం డ్రోన్ సర్వే నిర్వహిస్తుందని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారి సీతారాం ఆధ్వర్యాన డ్రోన్ భూ రీ సర్వేను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సరిహద్దులు, భూ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో భూ రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అన్నారు. అత్యాధునికమైన డ్రోన్ ద్వారా భూ రీ సర్వే చేయడంతో పారదర్శకంగా, ఎటువంటి తప్పులు లేకుండా సరిహద్దులను ప్రభుత్వం గుర్తిస్తుందని చెప్పారు. గ్రామంలో రీసర్వే చేయడానికి సిబ్బంది వచ్చినప్పుడు రైతులు తమ పాస్ పుస్తకాలను, డాక్యుమెంట్లను వారికి చూపించాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టును ఎస్‌టిలకే కేటాయించాలి

ప్రజాశక్తి- పలాస

మందస ప్రాజెక్టు పరిధి సోంపేట మండలం మాకన్నపురం-1 అంగన్వాడీ కార్యకర్తగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం గిరిజన అభ్యర్థి చల్లా జ్యోతిని నియమించాలని ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. నోటిఫికేషన్ అనుసరించి గిరిజనులకు కేటాయించారని అన్నారు. దీనికి ఇంటర్మీడియట్ అర్హతతో చల్లా జ్యోతి దరఖాస్తు చేస్తున్నట్టు తెలిపారు. గడువు సమయానికి ఒకే దరఖాస్తు వచ్చిందని, అనంతరం మే 24న నిర్వహించిన ఇంటర్వ్యూలో పాల్గొన్నారని అన్నారు. నోటిఫికేషన్ ప్రకారం ఇంటర్వ్యూ పూర్తి చేసుకున్న గిరిజన అభ్యర్థి చల్లా జ్యోతిని నియమించకుండా అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే కేంద్రంలో అప్పటికే ఆయాగా పనిచేస్తున్న కరమోజీ స్వప్నకు (బిసి) అభ్యర్థి నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండా గడువు, ఇంటర్వ్యూ ముగిసిన అనంతరం శ్రీకాకుళం ఐసిడిఎస్ పీడీకి దరఖాస్తు సమర్పించారని అన్నారు. నోటిఫికేషన్ ప్రాతిపదిక ప్రకారం గిరిజనులకు కేటాయించిన కార్యకర్తల పోస్టుకు బదులు ఆయా పోస్టును

మాట్లాడుతున్న జగన్నాయకులు

గిరిజన అభ్యర్థికి ఇస్తామని చెబుతున్నారని, దీంతో గిరిజన అభ్యర్థికి అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. అధికారులు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం పోస్టును భర్తీ చేయకుండా, గిరిజన అభ్యర్థికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. చల్లా జ్యోతిని మాకన్నపురం-1 అంగన్వాడీకి టీచర్ గా నియమించాలన్నారు. లేకుంటే గిరిజన సంఘాల తరపున న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ జెఎసి అధ్యక్షులు సవర రాంబాబు, ఆదివాసీ వికాస పరిషత్ గౌరవ అధ్యక్షుడు ఎం.దండాసి, ఎం.చిత్రసేను పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌లో అక్రమాల గుర్తింపు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీలో సోషల్ ఆడిట్‌లో పలు అక్రమాలను బృందం సభ్యులు గుర్తించారు. నౌపడ పెద్ద వీధిలో ఉపాధి పనులపై గురువారం సోషల్ ఆడిట్ బృందం ఆడిట్ నిర్వహించింది. 2015లో మృతి చెందిన జీరు ధర్మారావుకు 2022లోనూ కూలి జమ చేయడంపై సోషల్ ఆడిట్‌లో బయటపడింది.

ఈ సందర్భంగా గతేడాది పనులు చేసినా ఇంతవరకు బిల్లులు చెల్లించలేదని కూలీలు సుగ్గు మరిడయ్య, రోకళ్ల కామమ్మ, రోకళ్ల లక్ష్మి, కర్రి కోటిబాబు, కర్రి రాజు ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో వీరి జాబ్ కార్డులు పరిశీలించగా అవన్నీ తొలగించడినట్టుగా బృందం

ఆడిట్ నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్ బృందం

గుర్తించింది. దీంతో తమ కూలి ఎవరు ఇస్తారని సోషల్ ఆడిట్ బృందానికి కూలీలు ప్రశ్నించారు. అంతేకాకుండా 2020లో విధుల్లోకి చేరిన ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్‌రెడ్డికి 2023 వరకు కూలి అందుతుందని పలువురు ఆడిట్ బృందానికి తెలిపారు. ఉద్యోగులైన అంపలాం శ్రీనివాస్, సిద్ధ ప్రమీల, అనపాన పద్మలకు ఉపాధి కూలి వారి ఖాతాలకు జమైనట్లు ఫిర్యాదు చేశారు. కూలీల ద్వారా వచ్చిన ఫిర్యాదులను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆడిట్ బృందం తెలిపారు.

'మెడికవర్'లో గర్భిణికి అత్యాధునిక వైద్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

అత్యాధునిక క్రిటికల్ కేర్ వైద్యంతో శ్రీకాకుళం నగరంలోని మెడికవర్ వైద్యులు ఓ నిండు గర్భిణికి ప్రాణం పోశారు. వివరాల్లోకి వెళ్తే... జలుమూరుకి చెందిన 34 ఏళ్ల మహిళ 9 నెలల గర్భిణి అనారోగ్య సమస్యతో సమీపంలోని ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. ఆమెని వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణి ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ చేరడంతో అవి పాడైపోవడం, దాని ప్రభావంతో రక్తంలో ఇన్ఫెక్షన్ వల్ల గర్భాశయంలో శిశువు మృతి చెందింది. అక్కడ ఆపరేషన్ మృత శిశువును తొలగించారు. రోగి కోమాలోకి వెళ్లడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటంతో పది రోజుల క్రితం మెడికవర్ ఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగానికి తీసుకొచ్చారు. మెడికవర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సందీప్ గురుగుబెల్లి క్రిటికల్ కేర్ ఫిజిషియన్ ఆధ్వర్యాన ఆమెని వెంటనే వెంటిలేటర్‌పై వైద్యం కోసం తరలించారు. ఎఆర్‌డిఎస్, మల్టిపుల్ ఆర్గాన్ డిస్‌ఫంక్షన్ సింద్రోమ్ (ఎంఒడిఎస్) కారణంగా ఆమె కిడ్నీలు, లివర్ పాడయ్యాయని చెప్పారు. ఆమెని వెంటిలేటర్‌పైనే ఉంచి ప్రోన్ వెంటిలేషన్ (బోర్లా పడుకోబెట్టి) అత్యాధునిక వెంటిలేటర్ సదుపాయంతో చికిత్స అందించారు. దీంతో ఊపిరితిత్తులు, కిడ్నీ పనితీరు నెమ్మదిగా మెరుగుపడ్డాయి. ఆమెను ఆరు రోజులు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స చేసి పది రోజుల అనంతరం ఆమెని

డిశ్చార్జి చేస్తున్న వైద్యులు

సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్ చేశారు. అనంతరం డాక్టర్ సందీప్ మాట్లాడుతూ ఇటువంటి రోగికి కొద్దిపాటి ఆలస్యమైనా ప్రాణాలకు ముప్పు కలుగుతుందన్నారు. గతంలో ఇటువంటి వైద్యం కోసం విశాఖ వంటి నగరాలకు వెళ్లేవారని, అలా వెళ్లే క్రమంలో చాలా మంది చనిపోయారని చెప్పారు. మెడికవర్ ఆస్పత్రిలో అత్యాధునిక సదుపాయాలు, పరికరాలు అనుభవజ్ఞులైన వివిధ విభాగాల వైద్యులతో శ్రీకాకుళంలోనే మెరుగైన వైద్యసేవలను అందించడం ద్వారా రోగుల ప్రాణాలను కాపాడటం సాధ్యపడుతోందన్నారు. ఈ సందర్భంగా తమ బిడ్డని కాపాడిన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, యాజమాన్యానికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

130 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- పోలాకి

డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం ద్వారా విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన స్థానిక సాయిరాం ఆలయం వద్ద గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.రత్నంరాజు 130 మంది రోగులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 50 మందికి ఆపరేషన్ కోసం విశాఖ, పది మందికి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి రవణమ్మ, ప్రతినిధి మజ్జి లక్ష్మీనారాయణ, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్ కుమార్, పోలాకి పిహెచ్‌సి వైద్యాధికారి సుమప్రియ, వైసిపి నాయకులు ఆర్.త్రినాథరావు, సత్యసాయి సమితి కన్వీనర్ బి.రామారావు, మేనేజర్ ఎన్.అప్పలరాజు, తూలుగు కృష్ణ, సాయిరాం, ఎల్.చలపతిరావు పాల్గొన్నారు.

నేత్రాలను పరీక్షిస్తున్న వైద్యాధికారి రత్నంరాజు

తేజేశ్వరరావుపై కేసు కొట్టివేత

ఆమదాలవలస : సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావుపై నమోదైన కేసును గురువారం కోర్టు కొట్టివేసింది. వివరాల్లోకి వెళ్తే... రైల్వే ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ వద్ద 2002 మే 9న సిఐటియు ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. సందర్భంగా తేజేశ్వరరావు, పంచాది కృష్ణ, వై.చలపతిరావుతో పాటు మరో ఐదుగురు రైల్వే కార్మికులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును జూనియర్ సివిల్ జడ్జి కొట్టివేస్తూ తీర్పునిచ్చారు.

మృతురాలి వివరాలు లభ్యం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని వాండ్రాడ పంచాయతీ నర్సింగపల్లి గ్రామ సమీపంలోని రాళ్ల చెరువు గట్టుపై బుధవారం మృతి చెందిన మహిళ నరసన్నపేట హడ్కో కాలనీకి చెందిన జి.నీలమ్మగా గుర్తించామని ఎస్ఐ ఎస్.కె.మహ్మద్ ఆలీ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... మృతురాలు భర్త ఐదేళ్ల క్రితం మృతిచెందగా, నీలమ్మ గత కొంతకాలంగా మతిస్థిమితం లేక సంచరిస్తుంది. తరచూ ఆమె ఇలాగే బయటకు వెళ్తుంటే... విఆర్ఒగా పనిచేస్తున్న ఆమె కుమారుడు సింహాచలం వెతికి ఇంటికి చేర్చేవాడు. అయితే మూడు రోజుల క్రితం నీలమ్మ అదృశ్యమైంది. ఈ మూడు రోజులుగా భోజనం లేకపోవడంతో నర్సింగపల్లి రాళ్ల చెరువుపై మృతి చెందింది. గురువారం పత్రికలో చూసి సమాచారం తెలుసుకొని కుటుంబ సభ్యులు రావడంతో పోలీసులు మృతదేహాన్ని అప్పగించారు.

తహశీల్దార్ల బాధ్యతల స్వీకరణ

కవిటి : పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

టెక్కలి : టెక్కలి మండల తహశీల్దార్‌గా కురమాన ప్రవళ్లికాప్రియ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సారవకోట తహశీల్దార్‌గా పనిచేస్తూ... ఇక్కడకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం సబ్‌కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని, కార్యాలయ ఎఒ రాజమోహన్‌ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ మేరకు తహశీల్దార్‌ను రెవెన్యూ సిబ్బంది, విఆర్‌ఒలు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

కవిటి...

కవిటి: కవిటి మండల తహశీల్దార్‌గా పి.శేఖర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ కార్యాలయంలోని హెచ్ సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన శేఖర్‌ను కవిటి తహశీల్దార్‌గా నియమించారు. అలాగే ఇప్పటి వరకూ తహశీల్దార్‌గా పనిచేసిన ఆర్.అప్పలరాజును ఎల్.ఎన్.పేట తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఐ రమణమూర్తి, సర్వేయర్ పానిగ్రాహి, విఆర్‌ల సంఘం మండల అధ్యక్షుడు వజ్జ బాలకృష్ణ, విఆర్‌ఒలు దివాకర్, నారాయణ, ప్రశాంతి, కూర్మనాయకులు, కామరాజు, పార్వతి, దామోదర్ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

హెచ్‌ఎంల బదిలీ

నందిగాం : మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు గురువారం బదిలీ అయ్యారు. నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హేమలత, కోటబొమ్మాళి మండలం జర్జంగి బదిలీ అయ్యారు. ఈమె స్థానంలో పెద్దతామరాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పేడాడ అమ్మనమ్మ బదిలీపై వచ్చారు. పెద్దతామరాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తురకలకోట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ ఇందిరాదేవి బదిలీ అయ్యారు. తురకలకోట పాఠశాలకు ఎవ్వరినీ నియమించలేదు. దేవళభద్ర పాఠశాలకు చెందిన కె.ఎ.వి.ఎస్.ఎస్. ప్రభాకరరావుకు లావేరు మండలం మురపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ స్థానంలోనూ ఎవ్వరినీ నియమించలేదు. బదిలీ అయిన హెచ్‌ఎంలు గురువారమే బాధ్యతలు స్వీకరించారు. వీరికి ఎంఇఒ నర్సింహులు, ప్రధానోపాధ్యాయులు సంఘం జిల్లా జిల్లా కౌన్సిలర్ చిలుకు కృష్ణారావు, కో-ఆర్డినేటర్ వై.హరిబాబు, ఎం.రామారావు అభినందనలు తెలిపారు.

11న 'భారత్ బచావో' సమావేశం

ప్రజాశక్తి- టెక్కలి

కేంద్రంలో అప్రజాస్వామిక పాలన సాగిస్తున్న బిజెపి విధానాలను ఎండగట్టేందుకే భారత్ బచావో నినాదమని భారత్ బచావో జిల్లా కన్వీనర్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 11న టెక్కలి అంబేద్కర్ భవన్‌లో మెట్టమెదటి భారత్ బచావో సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సమావేశానికి భారత్ బచావో జాతీయ కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎం.ఎఫ్.గోపీనాథ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాకేష్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సి.భాస్కరరావు, దుడ్డు ప్రభాకర్, రాష్ట్ర నాయకులు గూడూరు సీతామహలక్ష్మి పాల్గొంటారని అన్నారు. ముఖ్య వక్తలుగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, పర్యావరణ పరిరక్షణ సమితి నాయకులు డాక్టర్ వై.కృష్ణమూర్తి, బిసి సంక్షేమ సంఘం నాయకులు పిట్ట చంద్రపతి, సిపిఐ న్యూ డెమక్రసీ కార్యదర్శులు తాండ్ర ప్రకాష్, వంకల మాధవరావు, స్త్రీ విముక్తి నాయకురాలు తాండ్ర అరుణ పాల్గొంటారని తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న జీడి రైతులు

జీడికి మద్దతు ధర కల్పించాలి

ప్రజాశక్తి- పలాస

ఉద్దాన ప్రాంతంలో పండిస్తున్న 80 కేజీల జీడి పిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు చెల్లించాలని మాకన్నపల్లి, నీలావతి జీడి రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎల్.మధుసూదనరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి పిక్కలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు.

పలాస కేంద్రంగా జీడి బోర్డు ఏర్పాటు చేయాలని, జీడి పంట విస్తరణకు, జీడి తోటల పునరుద్ధరణకు ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటించాలని కోరారు. జీడి రైతులకు జీడి పిక్కలు ఆరబెట్టుటకు టార్పాలిన్లను ఉచితంగా అందించాలన్నారు. తిత్లీ వల్ల దెబ్బతిన్న రైతులకు ఉచితంగా జీడి మొక్కలను సరఫరా చేయాలన్నారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో మాకన్నపల్లి సర్పంచ్ సైని దేశయ్య, నీలావతి సర్పంచ్ ప్రతినిధి సౌర తిరుపతిరావు, బి.ఓంకార్, కుత్తుం ధర్మారావు, తెప్పల అప్పలస్వామి, రాపాక చిన్నారావు, సాలిన వీరాస్వామి, సాలిన కోదండరావు, మల్లెన జీవనరావు, బోకర విశ్వనాథ్, బత్తిని మాధవరావు, తెప్పల భీమారావు పాల్గొన్నారు.

11న మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

ఇచ్ఛాపురం: మండలంలోని పురుషోత్తపురంలో ఉన్న మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేరేందుకు ఈ నెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ జి.శివప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు హల్ టిక్కెట్లను ఆన్‌లైన్‌లో డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. స్కూల్‌కు దరఖాస్తులు అందించిన అభ్యర్థులు కూడా హల్ టిక్కెట్లు పొందాలన్నారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని అన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఈ నెల 9, 10 తేదీల్లో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రవేశ పరీక్షలో ఎటువంటి ప్రశ్నలు, ఒఎంఆర్ షీట్ ఎలా నింపాలి తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మత్స్యకారులకు అవగాహన

ప్రజాశక్తి- సోంపేట

ప్రపంచ సముద్ర దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని ఇసుకలపాలెంలో ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యాన గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సంస్థ కో-ఆర్డినేటర్ సోమేశ్వరరావు మత్స్యకారులకు సముద్రంలో ఉండే జీవవైవిధ్యం, సముద్ర తాబేలు సంరక్షణ, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. మత్స్య సంపద అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై

అవగాహన కల్పిస్తున్న సభ్యులు

అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ రహిత సముద్ర తీరాన్ని ఏ విధంగా తయారు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో స్థానిక మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

కాలువలను ఆధునికీకరించాలి

ప్రజాశక్తి- పలాస

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లోనైనా శివారు భూములకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వ కృషి చేస్తుందా? లేదా? అని నియోజకవర్గం జనసేన నాయకులు వి.దుర్గారావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో శివారు భూములకు సాగునీరు అందకపోతే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా ఒక్కసారి కూడా శివారు భూములకు సాగునీరు అందలేదని ఆరోపించారు. వంశధార కాలువ నుంచి వచ్చే సాగునీరు వజ్రపుకొత్తూరు మండలం కిడ్సింగి, నగరంపల్లి 68 ఆర్ కెనాల్ సుమారు 12 కిలోమీటర్లు వరకు నీరు అందించాల్సి ఉందన్నారు. దిగువన సీతాపురం, బొడ్డపాడు, పాత టెక్కలి ప్రాంతానికి చెందిన 60 ఆర్ఎల్ కెనాల్ సుమారు 8 కిలోమీటర్లు ఆధునికీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యాన ఐదు స్వయం శక్తి సంఘాల సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. గ్రూప్ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. వైఎస్ఆర్ ఆసరా, సున్నావడ్డీ, డ్వాక్రా రుణమాఫీ, వైఎస్ఆర్ చేయూత వంటి పథకాలు గురించి వివరించారు. లబ్ధిదారులు సంక్షేమ పథకాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు టిడిపి విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి- పలాస

పలాస టిడిపి కార్యాలయంలో ఆవరణలో శుక్రవారం 3 గంటలకు విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. టిడిపి అధినేత చంద్రబాబు 2023 విడుదల చేసిన టిడిపి మేనిఫెస్టోలో భాగంగా భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని గ్రామాల్లో ప్రచారం చేయాలని కోరారు. విస్తృత స్థాయి సమావేశానికి నియోజకవర్గం పరిధిలోని టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

కొత్తూరు : పరిశీలిస్తున్న తులసీవరప్రసాదరావు

పొందూరు : రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

'ఫ్యామిలీ ఫిజీషియన్'ను పరిశీలన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని సోమరాజుపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నిర్వహణను పాతపట్నం వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాద్ గురువారం పరిశీలించారు. వైద్యులు సకాలంలో హాజరు కాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమానికి వైద్యులు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఈ విషయంపై జగన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తానని అన్నారు. ఈయనతో పాటు సర్పంచ్ సిమ్మ మధు, అదపాక శంకరరావు, కె.సంజీవరావు, పడల వెంకటకృష్ణ, గోవిందరావు ఉన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి

పొందూరు: గ్రామాల్లో అందజేస్తున్న వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కింతలి పిహెచ్‌సి వైద్యాధికారి పి.శివశంకర్ అన్నారు. మండలంలోని రాపాకలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని వృద్ధులకు, గర్భిణులకు, బాలింతలకు, మంచం పట్టి రోగులకు చికిత్సలను అందించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎస్ మణిప్రసాద్, ఎఎన్ఎం వనజాక్షి, గోవిందరావు, ఆశాకార్యకర్తలు, శ్రీదేవి, పుణ్యవతి, ముత్యాలమ్మ, ఉషరాణి పాల్గొన్నారు.

చిట్టిబాబు మృతదేహం

వ్యాను బోల్తా : బాలుడు దుర్మరణం

14 మందికి గాయాలు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని జాతీయ రహదారి బుడుమూరు కూడలి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి సరగడ చిట్టిబాబు (14) అక్కడికక్కడే మృతి చెందగా మరో 14 మంది గాయపడ్డారు. వీరితో పాటు నాలుగు మేకలు మృతి మృతి చెందాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా డెంకాడ మండలం కొండరాజుపేట, బంగారురాజుపేట, ఓల్లూరుపేట, ఉప్పాడపేట, అవ్వపేట గ్రామాలకు చెందిన 15 మంది వ్యాపారులు కలిసి తమ వద్ద ఉన్న మేకలను శ్రీకాకుళం జిల్లా కొటబొమ్మాళి మండలం నారాయణవలస సంతలో విక్రయించేందుకు మినీ వ్యానులో వెళ్తున్నారు. బుడుమూరు కూడలి సమీపంలోకి వచ్చేసరికి వ్యాను ముందు టైరు పేలడంతో వ్యాను అదుపు తప్పి పక్కన ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొంది. అనంతరం ఒక్కసారిగా రహదారిపై వ్యాన్ నాలుగు బోల్తాలు పడింది. వ్యానులో ఉన్న వారంతా రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. ఈ ప్రమాదంలో చిట్టిబాబుకు బలంగా గాయాలు కావడంతో ప్రమాదస్థలంలోనే మృత్యువాత పడ్డాడు. మిగతా 14 మంది గాయాపడ్డాడు. సమాచారం అందుకున్న శ్రీకాకుళం, ఎచ్చెర్ల, రణస్థలం మండలాలకు చెందిన 108 వాహనాలు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రమాదంలో మొక్క వెంకటరెడ్డి, భవానిశంకర్, బాకి భవాని, వనము రాంబాబు తీవ్రంగా గాయపడగా వీరి పరిస్థితి విషయంగా ఉంది. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. మిగిలిన వారికి సర్వజనాస్పత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరు పరిశీలించారు. ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటంబ సభ్యులకు అప్పగించారు.

సరదాగా వెళ్లి... అనంతలోకాలకు

విజయనగరం జిల్లా డెంకాడ మండలం కొండరాజుపేటకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న సరగడ చిట్టిబాబు పాఠశాలకు సెలవులు కావడంతో సరదాగా తన మేనమామతో సంతకు వెళ్లేందుకు వ్యాన్‌లో బయలుదేరారు. సరదాగా వెళ్లి...అనుకొని ప్రమాదంలో అనంతలోకాలకు వెళ్లిపోయాడని బాలుడు తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

సోంపేట : మండలంలోని బారువ వద్ద చాట్లబజార్ కూడలి గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో బేశి రామచంద్రపురానికి చెందిన త్యాడ భూషణమ్మ (86) మృతి చెందింది. స్థానికులు, బారువ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బారువలోని సాయిబాబా మందిరానికి వచ్చిన భూషణమ్మ తిరిగి తమ స్వగ్రామానికి వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉంది. ఆ సమయంలో బారువ నుంచి ఇచ్ఛాపురం వైపు బస్సు వెళ్తుంది. అది తమ గ్రామానికి వెళ్తుందా? అని అడిగేందుకు వృద్ధురాలు బస్సు వద్దకు వెళ్లింది. బస్సు ఆగి వెళ్తున్న క్రమంలో మృతురాలి చీర బస్సుకు అంటుకోవడంతో

చక్రాల కిందకు పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బారువ ఎస్ఐ చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

గాయపడిన వృద్ధుడు...

జలుమూరు: మండలంలోని గంగాధరపేట వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు గురువారం మృతి చెందారు. అబ్బాయిపేటకు చెందిన కూన సూర్యనారాయణ (78) ఇంటి సామగ్రి కొనుగోలు చేసుకుని ఇంటికి వెళ్తుండగా... కారు ఢీకొని గాయపడిన విషయం విదితమే. సూర్యనారాయణను చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని కిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాతపడ్డాడు. ఎస్‌పి పి.పారినాయుడు ఆధ్వర్యాన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య అమ్మడమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇదివరకే కుమారులిద్దరూ మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనిమెట్టలో కొట్లాట

పొందూరు: మండలంలోని కనిమెట్టలో బుధవారం రాత్రి డ్వాక్రా డబ్బుల విషయంలో తలెత్తిన వివాదం వైసిపిలోనే ఇరు గ్రూపులకు మధ్య కొట్లాటకు దారి తీసింది. ఈ కొట్లాటలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా

గాయపడిన కృష్ణమోహన్

ఉన్నాయి. డ్వాక్రా గ్రూపునకు సంబంధించి కృష్ణమోహనరావు భార్య, పిన్నికి సంబంధించిన ఆర్థికలావాదేవీల విషయంలో బుదవారం రాత్రి వివాదం తలెత్తింది. దీంతో జరిగిన కొట్లాటలో ఒక గ్రూపునకు చెందిన ఐదుగురు వ్యక్తులు... రెండో గ్రూపు వ్యక్తిపై దాడి చేశారు. ఈ కొట్లాటలో కృష్ణమోహన్, వేణుగోపాలరావు గాయపడ్డాడు. క్షతగాత్రులను 108లో ఆయా కుటుంబ సభ్యులు జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. కృష్ణమోహన్ కడుపులో రక్తం గడ్డకట్టడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ఎస్ఐ లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోల్తా పడిన ఆటో

తహశీల్దార్‌కు తప్పిన ప్రమాదం

పలాస: మండలంలోని సుమాదేవి రైల్వే స్టేషన్ సమీపం మాకనపల్లి రోడ్డుపై గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తహశీల్దార్ ఎల్.మధుసూదనరావుకు ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే... తహశీల్దార్ మండలంలోని మాకన్నపల్లి, బొడ్డపాడు గ్రామాల్లో భూ రీ సర్వేపై గ్రామ నిర్వహించేందుకు వెళ్లారు. తిరిగి కార్యాలయానికి తన కారులో వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఆటో బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడగా, కారు ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

లావేరు : మండలంలోని మురపాక శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఇందులో కొంతమంది విద్యార్థులు జాతీయ గీతాలు ఆలపించగా, మరి కొంతమంది విద్యార్థులు పాటల పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆటాపాటలు విద్యార్థుల మనసును ఉత్సాహంగా పరుస్తాయన్నారు. తొలిత రిసోర్స్‌పర్సన్ పి.షణ్ముఖరావు ఐకమత్యమే మహాబలం, గురజాడ అప్పారావు కథలు విద్యార్థులకు తెలియజేశారు.

టెక్కలి : చదువుకునే విద్యార్థులు తాము మాట్లాడే విధానంలో నైపుణ్యాన్ని ప్రదర్శించాలని గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ అన్నారు. గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా వాటి ఆవశ్యకత అనే అంశంపై

బలగ : మాట్లాడుతున్న చిరంజీవి

ఎచ్చెర్ల : మాట్లాడుతున్న చంద్రశేఖరరావు

ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సహాయకులు అమ్మనమ్మ పాల్గొన్నారు.

బలగ : విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, సీజనల్ వ్యాధులపై కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వార్డు హెల్త్ సెక్రటరీ బి.ఉషారాణి, చిరంజీవి అవగాహన కల్పించారు. పిల్లలు పౌష్టికరమైన ఆహారం తీసుకోవాలన్నారు. వడదెబ్బకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థీ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను, సహాయకులు కె.అనిత పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : మండలంలోని ధర్మవరం శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు ఏకాగ్రత గురించి రిసోర్స్‌పర్సన్ చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. నిగ్రహం లేని వాడు, నిలకడ లేని వాడు ఒకటేనని అన్నారు. విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు ఇది చాలా అవసరమన్నారు. తరగతి గదిలో పాఠం విన్నప్పుడు, ఆ పాఠం ఇంట్లో చదువుతున్నప్పుడు, పరీక్షలు రాస్తున్నప్పుడు విద్యార్థికి నిగ్రహం తప్పనిసరని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మల్లిపెద్ది చంద్రశేఖరరావు, సహాయకులు బి.సూర్యనారాయణ, గ్రంథాలయ పాఠకులు మహేష్, జగదీష్, సురేష్, కిరణ్, ప్రకాష్, సూరిబాబు, 73 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక శాఖాగ్రంథాలయాన్ని కార్యదర్శి వి.జి.ఎస్.శంకరరావు గురువారం పరిశీలించారు. నెల రోజు నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో విద్యార్థులు పుస్తకాలు చదవడం, కథలు, పుస్తక పఠనాలకు సంబంధించి అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తంచేశారు. అలాగే గ్రంథాలయం రిజిస్టర్లను రికార్డులను పరిశీలించారు. ఈయనతో పాటు గ్రంథాలయాధికారి టి.ఇందిర ఉన్నారు.

టెక్కలి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని అయోధ్యపురం పంచాయతీ కంట్రగడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి అట్ల సరోజనమ్మ, సీనియర్ నాయకులు సంపతరావు రాఘవరావు, సర్పంచ్‌లు బగాది హరి, గుజ్జు మోహన్‌రెడ్డి, రౌతు జయమోహన్, రాహుల్, రవి పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

శివారు భూములకు సాగునీరు

ప్రజాశక్తి- జలుమూరు

శివారు భూములకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని నామానపేట నుంచి కూర్మనాథపురం మీదుగా వెళ్లే 20 ఆర్ వంశధార కాలువలో గుర్రపు డెక్క తొలగింపు పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ రైతులకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, వంశధార అధికారులు పాల్గొన్నారు.

చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

ఆదిత్యుని దర్శించుకున్న ట్రిపుల్ ఐటి విసి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ట్రిపుల్ ఐటి వైస్ ఛాన్సలర్ విజయ్ కుమార్ గురు వారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ఆలయ విశిష్టతను వివరించి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పి.జగదీశ్వరరావు, ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహ నకృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ ఆసిరినాయుడు, పిఆర్ఒ మామిడి షణ్ముఖ, నాగార్జున పాల్గొన్నారు.

వాలంటీర్లకు నియామక పత్రాలు

కోటబొమ్మాళి: మండలంలోని పలు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వాలంటీర్లను గురువారం నియమించామని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు తెలిపారు. కస్తూరిపాడు, దంత, కిష్టుపురం, అక్కయ్యవలస సచివాలయంలో ఖాళీగా ఉన్న నాలుగురు వాలంటీర్లకు నియామక పత్రాలను అందజేశామన్నారు.

జెవికె కిట్లు పంపిణీకి సిద్ధం

ఇచ్ఛాపురం : పాఠశాలలు ప్రారంభం నాటికి జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఎంఇఒ అప్పారావు గురువారం తెలిపారు. యూనిఫారాలు, బాగులు, నోట్ పుస్తకాలు, షు, బెల్ట్‌లు, పుస్తకాలను స్టాక్ పాయింట్ నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు నేరుగా రూట్ ఆఫీసర్‌తో చేరవేస్తున్నట్లు తెలిపారు ఈ నెల 12లోగా అన్ని పాఠశాలలకు చేరవేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు ఉన్నారు.

భూ సర్వే డిటిగా వెంకటరావు

వెంకటరావు

పలాస : మండలం తహశీల్దార్ కార్యాలయంలో భూ రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా కె.వెంకటరావు గు రువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరిం చారు. ఆయన కొత్తూరు మండలం డిటిగా విధులు నిర్వహిస్తూ... ఇక్కడకు బదిలీపై వచ్చారు. పలాస లో భూ రీ సర్వే డిటిగా పనిచేసిన ఎస్.రవికుమార్ టెక్కలి తహశీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

'ఐఐస్'కు 21 మంది ఎంపిక

రణస్థలం రూరల్ : ఆదివారం నిర్వహించిన ఇన్‌స్పైర్ ఫ్రీ ఎడ్యుకేషనల్ (ఐఎస్ఇ) టాలెంట్ టెస్టు 92 మంది పాల్గొనగా, అందులో 13 మంది ఉచిత విద్యకు, 8 మంది స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ఐఐస్ స్కూల్ ఛైర్మన్, డైరెక్టర్ కొమనాపల్లి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా పరీక్షలు నిర్వహించి అందులో ఎంపికైన వారికి ఉచిత విద్య, స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామని అన్నారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభం

మెళియాపుట్టి : మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, ఎన్ఆర్ఐ బృందం సహాయంతో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌గౌడ్ గురువారం అన్న క్యాంటీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చడానికి రూ.5కే భోజనం సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి కమిటీ మాజీ ఛైర్మన్ బసవ భాస్కర్‌రెడ్డి, యు.వసంత, బసవ పరమేశ్వర్‌రెడ్డి, పడాల శ్రీను, ఒట్టికోళ్ల చక్రి పాల్గొన్నారు.

భోజనం వడ్డిస్తున్న నాయకులు

జి.సిగడాం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం : జి.సిగడాం గ్రామ సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాలంటర్లతో సంక్షేమ పథకాలు నేరుగా ఇంటికే సిఎం జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మీసాల సత్యవతి, మండల

అర్హతే ప్రామాణికం

అధ్యక్షులు బూరాడ వెంకటరమణ, జి.సిగడాం పిఎసిఎస్ అధ్యక్షులు ఎర్నేని ప్రకాష్, సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, ఎంపిటిసి కీర్తి తవుడమ్మ, ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ భాగ్యలక్ష్మి, హౌసింగ్ ఎఇ రమేష్, ఎపిఒ సత్యనారాయణ, ఎపిఎం రెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

టెక్కలి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని అయోధ్యపురం పంచాయతీ కంట్రగడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి అట్ల సరోజనమ్మ, సీనియర్ నాయకులు సంపతరావు రాఘవరావు, సర్పంచ్‌లు బగాది హరి, గుజ్జు మోహన్‌రెడ్డి, రౌతు జయమోహన్, రాహుల్, రవి పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని బొప్పాయిపురం పంచాయతీ విక్రంపురంలో నాడు-నేడు పథకంలో భాగంగా రూ.2.50 లక్షల వ్యయంతో పునఃనిర్మించిన అంగన్వాడీ భవనాన్ని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువుల సంరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధని కొనియాడారు. అంతకుముందు వాణిని సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి, గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమం లో ఎంపిపి అట్ల సరోజనమ్మ, సర్పంచ్ రౌతు జయమో హన్, ఎంపిటిసి గుంట రాజేష్, వైసిపి నాయకులు

చిన్నారులతో జెడ్‌పిటిసి వాణి

సంపతరావు రాఘవరావు, సచివాలయ డిడిఒ పాల రవికుమార్ రెడ్డి, కార్యదర్శి వర్ధన్, రామానాయుడు, అంగ న్వాడీ కార్యకర్త రజని, విఆర్ఒ వైకుంఠరావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై హర్షం

గోపాల్

పలాస : రాష్ట్ర ప్రభుత్వం 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులరైజ్ చేయడం, పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కి 41 మెడికల్ ఆఫీసర్ పోస్టులు మంజూరు చేయడంపై ఎపి ఎన్‌జిఒ పలాస శాఖ అధ్యక్షులు బోనేల గోపాల్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాబోయే 12వ పిఆర్‌సి ఉద్యోగులకు అన్నివిధాలా అనుకూలంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు 'భవిష్యత్‌కు గ్యారంటీ' సభ

భామిని : మండల కేంద్రమైన భామినిలో పాలకొండ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో శు క్రవారం పెద్ద ఎత్తున నిర్వహించబోయే భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమానికి మండల టిడిపి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరు కావాలనికా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేడిబోయిన జగదీశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు, గుమ్మడి సంధ్యారాణి హాజరై, ఇటీవల టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో అంశాలు మహాశక్తి, యువగళం, అన్నదాత, ఇంటింటికి నీరు, బిసిలకు రక్షణ చట్టం, పూర్ టు రిచ్ పథకాలపై ప్రసంగిస్తారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, సర్పంచ్ లోపింటి రాజేష్, టిడిపి మండల కమిటీ సభ్యులు బిడ్డిక ప్రసాద్, గురుబిల్లి లక్ష్మీపతి, కోరాడ రాజేష్ ఉన్నారు.

అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని ధన్నానపేటలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో గురువారం ఆర్థిక అక్షరాస్యత గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నా మంటూ ఎవరైనా ఫోన్లు చేసి మన బ్యాంకు అకౌంట్ వివరాలను అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. అలాగే ఎటిఎంల్లో అపరిచితులకు డబ్బులు విత్ డ్రా చేసి పెట్టమని కార్డును ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో సిఎఫ్ రమణమ్మ, సిఎఫ్ఎల్ సిబ్బంది రామారావు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.